క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శారదానగర్ ఫీడర్ పరిధి కాలనీల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, 11కేవీ పోస్టాఫీసు ఫీడర్ కింది కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్వామివారికి పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి జిన్నాయిగూడ శ్రీ ఛత్రగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి పల్లకీ సేవ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇచ్చిన ఎల్లమ్మ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో నిల్చున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యంగా సమర్పించుకున్నారు. సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ గురువా రెడ్డి

పహాడీషరీఫ్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ పి.గురువారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీ రహదారిలో సింగానియా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది కానిస్టేబుళ్లతో సమానమన్నారు. కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. నేరాలు జరిగినప్పటికీ సీసీల ఆధారంగా నిందితులను గుర్తించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.శ్రీను పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జాగ్రత్తగా వాహనాలు నడపాలి
- మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం: డ్రైవింగ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని సాగర్ రోడ్డుపై ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజుతో కలిసి ఆయన పలు వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని పది బైక్‌లను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నింబంధనల ప్రకారం లైసెన్సులు కలిగి ఉండాలని, అతి వేగంగా ప్రయాణించి ఎదుటి ప్రాణాలకు ముప్పు తెవద్దని, ప్రమాదంలో పడొద్దని హెచ్చరించారు. సోదాల్లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నర్సింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ కారాదు విషాదం

- అప్రమత్తంగా ఉంటే సుఖాంతం
- చవితి నేపథ్యంలో నిర్వాహకులకు పోలీసుల సలహాలు, సూచనలు



నిమజ్జనానికి తరలుతున్న బాలాపూర్ గణనాథుడు (ఫైల్)

పహాడీషరీఫ్: వినాయక చవితి ఉత్సవాలు అనగానే పక్షం రోజుల ముందు నుంచే పండుగ వాతావరణం నెలకొంటుంది. చిన్న, పెద్ద తేడా లేకుండా అంతా కలిసి కట్టుగా జరుపుకొనే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో జోష్ నింపుతుంది. ఇటు మండప నిర్వాహకులు, అటు పోలీస్, మున్సిపాలిటీ, జల మండలి, విద్యుత్ విభాగాల అధికారులంతా చవితికి రెండు వారాల ముందు నుంచే నిమజ్జనం వరకు ఏర్పాట్లలో తలమునకలవుతారు. ఉత్సవాలను పురస్కరించుకొని రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధి బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీసులు మండప నిర్వాహకులతో శాంతి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు సంతోషంగా జరుపుకోవాలని, చిన్న చిన్న జాగ్రత్తలను పాటించని కారణంగా ఏటా ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉంటే.. అంతా మంచే జరుగుతుందని పోలీసులు సూచిస్తున్నారు.

పకడ్బందీగా మండపాల ఏర్పాటు

వినాయక మండపాలను నాణ్యతతో కూడిన సామగ్రితో పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు పోలీసులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వలన గాలి, దుమారం వచ్చినప్పుడు వేదికకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. గణనాథుడి వద్ద దీపాలు వెలిగిస్తుండడాన్ని దృష్టిలో ఉంచుకొని దానికి దగ్గరలో అగ్నికి అంటుకునే స్వభావం కలిగిన వస్త్రాలు, పూలదండలు, అలంకరణ సామగ్రి, పెట్రోల్, కిరోసిన్ లాంటి వాటిని ఉంచరాదని స్పష్టంచేస్తున్నారు. దీంతో పాటు విద్యుత్ తీగల ఎదుట మండపాలను ఏర్పాటు చేయరాదన్నారు. నిమజ్జనానికి తరలించే సమయంలో గణనాథుడిని వాహనంలోకి ఎక్కించే క్రమంలో ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి.

పవిత్రతను దెబ్బతీయరాదు

చవితి ఉత్సవాల్లో నిర్వాహకులు భక్తి పాటలను మాత్రమే పెట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా సినిమా పాటలు పెట్టి పవిత్రతను దెబ్బతీయరాదని సూచించారు. ఉత్సవాలు కొనసాగినన్ని రోజులు నిర్వాహకులు మద్యం, మాంసాహారానికి ఉండి.. పూజా కార్యక్రమాలు నిర్వహించాలని భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు సూచిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై దృష్టి

మండప నిర్వాహకులు ఎక్కువ మంది అనధికారికంగా విద్యుత్ స్తంభాల నుంచి కనెక్షన్లు తీసుకుంటుంటారు. దీని వలన విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వేలాడుతున్న తీగలు, గాలి, వానకు కింద పడి ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. అలా కాకుండా ట్రాన్స్‌కో అధికారుల అనుమతితో కనెక్షన్ తీసుకుంటే మంచిదని, ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే వారు స్పందిస్తారని అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి నిర్లక్ష్యం వలనే గతంలో పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధి మంఖాల్‌లో ముగ్గురు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు చెప్పారు.

భారీ బందోబస్తు



బాలాపూర్ గణేశ్ మండపం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ఎప్పటిలాగే ఈ ఏడు అందరి సహకారంతో శాంతియుతంగా చవితి వేడుకలను పూర్తి చేస్తాం. ఇప్పటికే మండపాల నిర్వాహకులకు సలహాలు, సూచనలు చేశాం. రాత్రి పూట మండపం వద్ద ఇద్దరు నిర్వాహకులు ఉండాలి.

– టి.భూపతి, ఇన్‌స్పెక్టర్, బాలాపూర్

సూచనలు పాటించాలి



ఉత్సవ నిర్వాహకులు తమకు సహకరించాలి. శాంతియుతంగా పండుగను జరుపుకోవాలి. తమ పరిధిలోని గణనాథులను ఎక్కువగా జల్‌పల్లి చెరువులోనే నిమజ్జనం చేయిస్తాము. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. జల్‌పల్లి, మామిడిపల్లి, తుక్కుగూడ, సర్దార్ నగర్, మంఖాల్, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్‌లలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం.

– పి.గురువారెడ్డి, ఇన్‌స్పెక్టర్, పహాడీషరీఫ్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



లేమూరు పీహెచ్ వైద్యురాలికి వినతిపత్రం అందజేస్తున్న ఆశలు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: ఆశ వర్కర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు.. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కందుకూరు, రాచులూరు, లేమూరు పీహెచ్‌సీ వైద్యులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఆశలకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, అదే సమయంలో వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు సరస్వతి, నాయకురాళ్లు లక్ష్మీదేవి, వెంకటమ్మ, భాగ్యలక్ష్మీ, జయసుధ, శ్రీలక్ష్మీ, అప్రోచ్, ముంతాజ్ బేగం, అశ్విని, అండాలు, అనిత, సుశీల, రాధిక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో యువజన సంఘం ప్రతినిధులు

కందుకూరు: వివేకానంద యువజన సంఘం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. మంగళవారం సంఘం యూత్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ సభ్యులు ప్రస్తుత కమిటీని సన్మానించారు. అనంతరం గ్రామంలో చేసిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనుల గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు అమరవాది కృష్ణ, ఎల్మటి దేవేందర్‌రెడ్డి, టంకరి శేఖర్‌రెడ్డి, క్లాం రాజేందర్‌రెడ్డి, క్లాం రవీందర్‌రెడ్డి, కొంతం మోహన్‌రెడ్డి, టంకరి మధుసూదన్‌రెడ్డి, జిట్టా రవీందర్ రెడ్డి, సురసాని లక్ష్మారెడ్డి, క్లాం రవికాంత్‌రెడ్డి, కొంతం జంగారెడ్డి, సురసాని భూమిరెడ్డి, క్లాం చెన్నారెడ్డి, క్లాం రాంరెడ్డి, సురసాని రవీందర్‌రెడ్డి, కొలను విష్ణువర్ధన్‌రెడ్డి, సామల దయాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జిట్టా రాజేందర్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు ఎ.జగన్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, ఎ.మనోహర్‌గుప్తా, ఎ.శ్రీనివాస్‌గుప్తా, జాపాల రాంచందర్, కె.అరుల్లాల్, ఎ.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కమలనాథులు

- బీజేపీ నాయకులు

కడ్తాల్: సభ్యత్వ నమోదును పెంచి, పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్, జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య అన్నారు. మంగళవారం మండల పరిధి మైసిగండి గ్రామంలో ఎస్పీ నాయక్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. కమలనాథులు ఇంటింటికీ తిరిగి.. కేంద్రంలోని సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సంక్షేమాభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దాంతో పాటే పార్టీ సిద్ధాంతాల గురించి వివరించి, సభ్యత్వం పొందేలా చూడాలని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భగీరథ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, డాక్టర్ రమేశ్‌అయ్యగార్, బీసీమోర్చా మండల అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నాయకులు లక్ష్మణ్ నాయక్, అశోక్‌రెడ్డి, మహేశ్, ఈర్లపల్లి శేఖర్, సాయిలు, జంగం వెంకటేశ్, నరేందర్ ఉన్నారు.

బస్టాండ్‌లో బెంచీల ఏర్పాటు

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం సంస్థ మంగళవారం స్టీల్ బెంచీలను ఏర్పాటు చేయగా.. కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి ప్రారంభించారు.

ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలి

తలకొండపల్లి: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తలకొండపల్లి మండలంతో పాటు, మాడ్గుల్, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో మొక్కజొన్న, పత్తి, వరి, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ నాలుగు మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని, వ్యవసాయ అధికారులచే ప్రభుత్వం పంట నష్టం సర్వే చేయించి, తగిన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించండి

యాచారం: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఇంటి స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫోరం రాష్ట్ర కమిటీ చిక్కుడు గుండాల ఆధ్వర్యంలో ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు 200 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అదే విధంగా సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు కొంతం యాదగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బోసుపల్లి విరేష్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గని శ్యామల, నాయకులు ముదిగొండ అజయ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత గుండె చికిత్స శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 8న కల్వకుర్తి పట్టణంలోని ప్రశాంత్ క్లినిక్ ఆవరణలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచితంగా గుండె చికిత్స శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా ఈసీజీ, 2డీఈకో పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీతో అనంతరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు

ఆమనగల్లు: నల్లగొండ పార్లమెంటు సభ్యుడు రఘువీరా రెడ్డిని మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ నాయకులు జగన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

నియామకం

మంచాల: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చెన్నారెడ్డి గూడ గ్రామ చీఫ్ ప్రమోటర్‌గా పిడుగు పరమేష్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధికారులు నియామక పత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అడహక్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్, యాదగిరి ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఎంపీడీఓ శైలజ



నీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎంపీడీఓ శైలజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్తీలు, కాలనీల్లో ఆమె పంచాయతీ కార్యదర్శి, కారోబార్లు, సిబ్బందితో కలిసి పర్యటించారు. నివాసాల మధ్య ప్లాస్టిక్ డబ్బాలు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కవర్లతో పాటు చెత్తను ఉండకుండా చూసుకోవాలని స్థానికులకు సూచించారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. డెంగీ జ్వరం వచ్చిన బాలుడిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. నీరు నిల్వ ఉన్న చోట దోమలు పెరుగుతాయని, వాటి నివారణకు మందును పిచికారీ చేయించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పంచాయతీ కార్యదర్శి, కారోబార్లను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుజాత, కారోబార్లు శేఖర్, శంకర్ పలువురు పాల్గొన్నారు.

నవరాత్రులకు ఏర్పాట్లు చేయండి



ఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న మీర్‌పేట ఉత్సవ సమితి నాయకులు

మీర్‌పేట: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి మీర్‌పేట అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలువురితో కలిసి ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలని, మంత్రాల చెరువు వద్ద భారీ క్రేన్‌ను సమకూర్చాలన్నారు. విద్యుత్ లైట్లను సిద్ధం చేయాలని, పార్కింగ్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా నిమజ్జనానికి వెళ్లే గణనాథులకు తగలకుండా చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. చెరువులో పూలు, పత్రి వేయకుండా సిబ్బందిని నియమించి చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు భీంరాజ్, సోమేశ్వర్, కీసర హరినాథ్‌రెడ్డి, పల్లె జంగయ్యగౌడ్, తీగల సాయినాథ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



ఓ కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న జీపీ సిబ్బంది

కడ్తాల్: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జీపీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పారిశుద్ధ్య కార్మికులచే మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. సీజనల్ వ్యాధులు ముసరకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం పలు కాలనీలో వీధులు, రోడ్లను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లగా.. ఆ పనులను మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పరిశీలించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో వ్యర్థాలు వేయరాదని, మురుగు నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

- కమిషనర్ జ్ఞానేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మీర్‌పేట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆశ వర్కర్లు, మున్సిపల్ సూపర్‌వైజర్లు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధి ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని బీఎల్‌ఓలకు చెప్పారు. సమావేశంలో మేనేజర్ చంద్రశేఖర్, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయపోల్‌లో కుక్కల బెడద



రోడ్డుపై కుక్కల గుంపు

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ సింహాలంటే గతంలో విశ్వాసం గల జంతువులు అని ప్రజల్లో నమ్మకం ఉండేది. కానీ ప్రస్తుతం మృత్యు సింహాలుగా మారి.. వారిని గుర్రుగా చూస్తుండటంతో భయపడుతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ.. అకారణంగా దాడికి పాల్పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో గతంలో క్రిశాంక్ అనే బాలుడు కుక్కల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. అదే గ్రామంలో ప్రస్తుతం పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ.. కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.